


# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 11

ఓ సీతాకోక చిలుకా నాకో సాయం చేస్తావా
నీ రెక్కల్లోని చుక్కల్తో నా గేయం రాస్తావా
చూసే కళ్ళలో నా కలలే పూసేలా
నువ్వాలే కొమ్మల్లో నా విరివాగే పొంగేలా-సాగేలా నా పాటా

చూపులు వెళ్ళి జలపాతం లో ఈది కొత్తకొత్త రంగులు తొడుక్కుంటే
ఊపిరివెళ్ళి చిరుగాలుల్లో తుళ్ళి పూలవాసన మోసుకొస్తూ వుంటే
ఊహలన్నీ ముందుగానే వెళ్ళి ఊసులెన్నో మోసుకొస్తూ వుంటే
ఊరు పూలరధమల్లే మారి వేచి వున్నదనిపిస్తూ వుంటే

నేనే నాకన్నా ముందుగా అప్పుడే అక్కడున్నట్టుగా
మనసా ఎగిరిపోయావా!

గోదారి నీళ్ళాడినట్టుంది బరువోపలేనట్టు గట్టుంది
ఈనాడో మర్నాడో అంటోంది రాదారి పడవల్ని కంటోంది
సాగరమే సంబరమై ఎదురు వచ్చిందేమో
భద్రాద్రి పొత్తిళ్ళలో మా సీతమ్మ పురుడోయగా
నాకేమి లోటుందమ్మా...

నీలాంబరమే ఇంద్రధనువు మగ్గంపై నేల కోసం చీర నేసెనేమో
చేలు పూలూ జిలుగుల మెరుపై అద్దకాల అందమిచ్చేనేమో
కోనసీమ తల్లి కులుకే కులుకూ సంకురాత్రి సిరి పలికేవరకూ
పంట పాప ఇంట వెలిగే వెలుగు భోగిపళ్ళు పోసి మురిసేకళ్ళతో
కరి మబ్బు దీపావళి కరిగివచ్చే ఇల ముందుకే వినిపిస్తోంది చలి జావళి!

(ప్రేమించేది ఎందుకమ్మా చిత్రానికి ఇళయరాజా సంగీత సారధ్యంలో బాలు పాడినది)

నా పాట పంచామృతం!
నా గగన గీర్వాణి స్నానాలు సేయంగ ||నా పాట||

వల్లకి మీటగ, పల్లవ పాణి
అంగుళి సేయనా పల్లవిని...
శారద స్వరముల సంచారానికి
చరణములందించనా ||నా పాట||

గళము కొలను కాగా ప్రతిపాట పద్మమేగా

పదము వెల్లి విరిసి రాదా విధిసతి పాదపీఠి కాగా

శ్రుతిలయలు మంగళహారతులై

స్వరసరళి స్వాగత గీతికలై

ప్రతిక్షణం నివేదనం

సరస్వతి సమర్పణం

గగనము గెలువగ గమన గతులు సాగ...

శిశువుల పశువుల ఫణుల శిరసులూగ... ||నాపాట||

( అల్లరి మొగుడు చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

అతడు: జాముారాతిరి జాబిలమ్మ జోలపాడనా ఇలా

జోరుగాలిలో జాజికొమ్మ జారనీయకే కలా

వయ్యారి వాలుకళ్ళలోన వరాలమింటి పూలవాన

స్వరాలు ఊయలూగువేళ ||జాము||

అతడు: కుహు కుహు సరాగాలే శృతులుగా

కుశలమా అనే స్నేహం పిలువగా

కిలకిలా సమీపించే సుడులలో

ప్రతి పాద పదాలేవో పలుకగా

కునుకు రాక బుట్టబొమ్మ గుబులుగుందని

వనము లేచి వద్దకొచ్చి నిద్రపుచ్చనీ... ||జాము||

**అతడు: మనసులో భయాలన్నీ మరిచిపో**

**నిదురలో మరో లోకం తెలుసుకో**

**కలలతో ఉషాతీరం వెతుకుతూ**

**నిదురలో నిషారాణి నడిచిపో**

**చిటికలోన చిక్కబడ్డ కటికచీకటి**

**కరిగిపోక తప్పదమ్మ ఉదయకాంతికి ||జాము||**

(క్షణక్షణం చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

హీరో హీరోయిన్లు పాట పాడుకోవాలంటే, విపరీతమైన వాయిద్యాల హోరులో, అనేకమైన కోరస్‌లను వెంటపెట్టుకుని, వివిధ దేశాలలో చిత్రీకరిస్తే కానీ, ప్రేక్షకులు చూడరు అని సుదృఢంగా నమ్మే ఈ రోజుల్లో ఎప్పుడో 1952-53ల్లో అప్పు చేసి పప్పుకూడు సినిమాలో రామారావుగారు ఒక బాల్కనీలో, సావిత్రిగారు ఒక బాల్కనీలో నులుచుని, "ఎచటనుండి వీచనో ఈ చల్లని గాలి" అని పాడేసి ఎవరి ఇంట్లోకి వాళ్ళు వెళ్ళిపోయినట్లుగా శ్రీదేవి లాంటి హీరోయిన్‌ని వెంకటేష్‌లాంటి హీరోని పెట్టుకుని ఒక అడవిలో చాలా అన్‌గ్లామరస్ వాతావరణంలో హీరో హీరోయిన్లిద్దరూ వున్న చోటినుంచి కదలకుండా, షాట్ మార్చకుండా, పూర్తి పాటని చిత్రీకరించి ప్రేక్షకులు మళ్ళా చూసేలా చేసిన రామ్‌గోపాల్‌వర్మ సాహసానికి, ఆత్మవిశ్వాసానికి, చిత్రికరణ మీద ఆయనకున్న అవగాహనకి, అభినందనలు అర్పించేందుకు ఈ పాటనిక్కడ ఉదహరించాను.

*****

# కల్లోల తరంగం

ఏ కాలంలోనైన, ఏ యుగంలోనైనా, ఏ సమాజంలోనైనా, వర్తమానం అనేది దానికుండే సమస్యలూ, సంఘర్షణలతోనే నిండి ఉంటుంది. పరిపూర్ణమైన శాంతి, ఇంత కంటే కోరదగింది ఇంకేదీ లేదు అనే పరిస్థితి వుండదు. రామాయణ కాలంలో కూడా రావణుడున్నాడు శ్రీకృష్ణుడి కాలంలో కూడా కంసుడూ, కీచకుడు వున్నారు. ఇవి ఎంత సత్యమైనా మనసున్న మనిషికి తన చుట్టు పక్కల వున్న సమాజపు అవ్యవస్థిత, అస్తవ్యస్తతా చూస్తూ ఇది సహజమే ఇలాగే వుంటుంది మరేం ఫర్వలేదు అని నిమ్మకు నీరెత్తినట్లు వుండటం సాధ్యంకాదు. అయ్యో ఏదో అయ్యిపోతోంది ఏదో చేయ్యాలి, ఎవ్వరూ ఏమీ చెయ్యకపోతే పుట్టి మునిగిపోతుంది అని పుట్టెడు దిగులుకు లోనవుతూ వుంటారు. అలా కాకుండా, మెదడు స్పందించకుండా నాపరాయిలా వుండిపోతే సమాజం గతి ప్రగతి లేకుండా

శిలాజంలా మారిపోయి వుండేది. చరిత్ర అంటే నిన్నటి కథే కాదు. ఇవాళ్టి స్థితి రేపటి చరిత్ర అవుతుంది. రేపటి గురించిన కథే వర్తమానం, రేపటి గురించి ఎందుకు కలగనాలంటే ఈ రోజు అసంతృప్తి నుండి తప్పుకోవడానికి. పాత్రలు స్పందించవలసి వచ్చినప్పుడు ఆ స్పందన సమాజంగా నాది కూడా అయి వుంటుంది కనుక, ఈ విభాగంలో కూడా సిరివెన్నెల సీతారామశాస్త్రి కంటే సీతారామశాస్త్రి గొంతే ఎక్కువ వినబడుతూ వుంటుంది.

**సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని**

**సుఖాలమనలేని వికాసమెందుకని**

**సుమాల బలికోరే సమాజమెందుకని**

**అడుగుతోంది అదిగో ఎగిరే భరత పతాకం**

**తెలుసుకోండి ఆ తల్లి తపనలో నేటి కన్నీటి కథనం**

**త్రిశంకు స్వర్గంలో తను త్రివర్ణస్వప్నమని**

**విషాదవర్ణంలో తను వివర్ణచిత్రమని**

**ఆకసాన తన నెగరేసి**

**ఏకాకిగ తననొదిలేసి**

**పాతాళంలో నిలిచిన పౌరుల కరతాళ ధ్వని చూసి**

**విల విలలాడుతు వెల వెలబోయెను మువ్వన్నెల జెండా**

**జలజల కురిసెను తెగి పడిపోయిన ఆశల పువ్వుల దండ**

**త్రిశంకు స్వర్గంలో...**

**విషాద వర్ణంలో...**

**ఆవేశంలో ప్రతి నిముషం ఉరికే నిప్పుల జలపాతం**

**కత్తికొనల ఈ వర్తమానమున బ్రతుకదు శాంతి కపోతం**

బంగరు భవితకు పునాది కాగల యువత ప్రతాపాలు
భస్మాసుర హస్తాలై ప్రగతికి సమాధి కడుతుంటె
శిరసు వంచి అదిగో ఎగిరే భరత పతాకం
చెరుగుతోంది ఆ తల్లి చరితలో విశ్వవిజయాల విభవం ||సురాజ్య||

కులమతాల దావానలానికి కరుగితున్నది మంచుశిఖరం
కలహముల హాలహలానికి మరుగుతున్నది హిందుసంద్రం
దేశమంటే మట్టికాదను మాట మరచెను నేటి విలయం
అమ్మ భారతి బలిని కోరిన రాచకురుపీ రాజకీయం
విషము చిమ్మెను జాతి తనువున ఈ వికృతగాయం ||సురాజ్య||

(గాయం చిత్రంలో శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఈ పాట నాకు నంది అవార్డు తెచ్చిపెట్టింది. ఈ పాట గురించి భావతరంగంలో రామ్‌గోపాల్‌వర్మ గురించి చెప్పినప్పుడు వివరంగా చెప్పాను.

నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని
అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని
మారదు లోకం మారదు లోకం
దేవుడు దిగిరానీ ఎవ్వరు ఏమైపోనీ ||మారదు||

గాలివాటు గమనానికి కాలిబాట దేనికి?
గొర్రెదాటుమందకి నీ జ్ఞానభోధ దేనికి?
ఏ చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం
ఏ క్షణాన మార్చుకుంది చిచ్చుల మార్గం

రామబానమార్పిందా రావణకాష్టం
కృష్ణగీత ఆపిందా నిత్య కురుక్షేత్రం ||నిగ్గదీసి||

పాతరాతి గుహలు పాలరాతి గృహాలైనా
అడవినీతి మారిందా ఎన్నియుగాలైనా
వేట అదే వేటు అదే నాటికథే అంతా
నట్టడవులు నడివీధికి నడొచోస్తే వింత
బలవంతులె బ్రతకాలని సూక్తి మరవకుండా
శాతాబ్దాలు చదవలేదా ఈ అరణ్యకాండ ||నిగ్గదీసి||

(గాయం చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఈ పాటలో వున్న ప్రత్యేకత ఏమిటంటే రామ్‌గోపాల్‌వర్మ ఈ పాటను నా మీద చిత్రీకరించారు. ‘నేను నటుడ్ని కాను. నా ఆకారం కూడా తెరమీద కనిపించడానికి, ప్రేక్షకులు చూసి ఆనందించడానికి అనువుగా వుండకదా, నన్నెందుకు పెట్టుకున్నారు’ అని ఆయన్ని అడిగినప్పుడూ, ఆయన ‘నీ ఆకారం, మీ నటన కాదు. మీరు పాడుతున్నప్పుడు మీ కళ్ళల్లో ఆ నిప్పు తునకలూ, విచ్చుకత్తులూ ఏమైతే వున్నయో అవి కావాలి. మీరు సినిమా కోసం రాయని పాటను నేను సినిమా కోసం తీసుకుంటున్నాను కాబట్టి మీరే పాడాలి’ అన్నారు. నేను ఆ సినిమాలో నటించిందేమీ లేదు. పైన మామూలుగా ఎలా పాడుకుంటనో అలాగే పాడాను.

ఆ పాటలో నిరాశ కంటే ఒక విధమైన ఉక్రోషంతో పాటు ఒక చురక వుంది. అందులో కొన్ని భావాలు "ఏ చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం, ఏ క్షణాన  మార్చుకుంది చిచ్చుల మార్గం" అని "రామబాణం ఆర్పేనా, రావణకాష్టం, కృష్ణగీత ఆపేనా నిత్య కురుక్షేత్రం" అనే పదాల ద్వారా సమాజాన్ని, ఈ స్థితికి కారణం మరెవరో కాదు తమకి ఏం కావాలో తెలుసుకోని వాళ్ళు ఇంకొకళ్లు తెలియజేసిన సరిగా స్పందించలేని వాళ్ళు అయిన- సామాజికులలో ప్రతి ఒక్కర్ని కూడా నిగ్గదీసి అడగాలి అని భావించాను. సూచించాను. అలా అడగవలసినవాళ్ళు కూడా పై వాళ్ళెవరో కాదు. ప్రతి ఒక్కరూ తనను తాను ప్రశ్నించుకోవాలి.

నిగ్గదీసి అడుగు, ఈ సిగ్గు లేని జనాన్ని అన్నప్పుడు, విపరీతంగా రియాక్ట్ అయి, నువ్వెవడివి ఈ సమాజాన్ని నిందించడానికి? అని నన్ను నిలదీయడానికి బదులుగా అనేకమంది నన్ను అభినందించారు. అప్పుడు నాకనిపించింది. తమ యొక్క అసహాయత, ఉపేక్ష ప్రతి ఒక్కరికి తెలుసు. ప్రతి వ్యక్తిలోనూ, ఎంతో కొంత గిల్టీ ఫీలింగ్ ఉంది. ఈ ఫీలింగ్ వల్లనే ఈ పాటను ప్రేక్షకులు మనస్ఫూర్తిగా అభినందించగలిగారు అని అనుకుంటూ వుంటాను.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS